నూరేళ్ళ తెలుగు కథకు నవ్య నీరాజనం - 55



# నేటి కథలు సమాజ ప్రతిబింబాలే! అనుమానం లేదు!

**- డాక్టర్ సోమరాజు సుశీల**


'చిన్న పరిశ్రమలు - పెద్ద కథలు'తో సాహిత్య రంగ ప్రవేశం చేసిన డాక్టర్ సోమరాజు సుశీల 'ఇల్లేరమ్మ కథల'తో ఇంటింటా పరిచయమయ్యారు. సున్నితమైన హాస్యం, వ్యంగ్యం ఆమె కథలను చదివింపజేస్తాయి. దాదాపు ప్రతికథలోనూ కనిపించే మానవతా స్పర్శ, హృదయావిష్కరణ 'మన జీవితానుభవమే' అని పాఠకులు అనుకునేలా చేస్తాయి. లేటుగా వచ్చినా లేటెస్ట్‌గా వచ్చిన డాక్టర్ సోమరాజు సుశీలతో 'నవ్య' ఇంటర్వ్యూ ఈవారం.

### చిన్నప్పట్నుంచీ రాసే అలవాటుందా?

అస్సల్లేదు. పైగా రాయడం అంటే మహా బద్ధకం కూడా. నేను పూనాలోని ఎన్‌సీఎల్‌లో కెమిస్ట్రీలో పీహెచ్‌డీ చేస్తున్నప్పుడు ఆంధ్రపత్రికలో ఓ కథ వచ్చింది. పరిశోధన చేస్తున్న విద్యార్థులను గైడ్లు ఎలా వేధిస్తారో అన్నది సరదాగా రాసిన కథాంశం. రాసిందెవరో ఇప్పుడు గుర్తులేదుగానీ, అది బాగా నచ్చి 'మా గతీ ఇంతే'నంటూ నేను ఆ పత్రికకు ఓ ఉత్తరం రాశాను. అది అచ్చయింది. అదే అచ్చులో వచ్చిన నా తొలి రచన. రాయాలని కూడా తెలీదు నాకు.

### తొలికథా...కమామిషు చెప్పండి!

నా తొలి కథ 'మహాశ్రమ'. ఆ కథలో జరిగినవన్నీ ఒకేరోజు నా జీవితంలో జరిగాయి. వాటితో విసిగిపోయి ఆ కథ రాసేశాను. పైగా ఆరోజు కొంచెం ఫ్రీగా ఉన్నాను కూడా. చేతిలో డబ్బుల్లేకపోతే ఖాళీగానే ఉంటాం కదా, అలారాసేనది. మర్నాడు ఏదో సెలవు రోజు, మా చెల్లెళ్ల ఇంటికొ



కుటుంబ సభ్యులతో....

చ్చారు. వాళ్ళకు చదివి వినిపిస్తే బావుందన్నారు. అబ్బూరి ఛాయాదేవిగారు నా స్నేహితురాలు. ఆవిడకు ఫోన్లోనే చదివి వినిపించాను. బావుంది, ఆంధ్రజ్యోతి (వారపత్రిక)కి పంపమని ప్రోత్సహించారు. సరే అని పంపిస్తే ఆ వారమే అచ్చు వేసేశారు. అప్పట్లో మేం ప్రారంభించిన 'భాగ్యనగర్ లాబొరేటరీస్' చిన్న పరిశ్రమ. దానికోసం చాలా ఇబ్బందులు పడుతూ ఉండేవాళ్ళం. ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు ఎక్కడెక్కడికో వెళ్ళి 'మా రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టండి' అంటూ సమావేశాల్లో అందర్నీ ఆహ్వానించేవారు. ఇక్కడ పెట్టినవాళ్ళకేమో ఏ సాయమూ అందక అల్లాడేవాళ్ళం. 'అయినవాళ్ళం మహాప్రభో' కథ అతనిమీదే! తొలి కథ అచ్చయ్యాక చాలా ఉత్తరాలొచ్చాయి. దాంతో ఆంధ్రజ్యోతి వాళ్ళు ఫోన్ చేసి మా పరిశ్రమ అనుభవాలతో ఇంకొన్ని కథలు రాయమన్నారు. అలా ఆంధ్రజ్యోతిలో 'చిన్న పరిశ్రమలు - పెద్ద కథలు' వారం వారం వచ్చేయి, తర్వాత పుస్తకంగా వచ్చేయి.

### అసలు పరిశ్రమ పెట్టాలన్న ఆలోచన మీకెలా వచ్చింది?

నేను విజయవాడ మేరీ స్టెల్లా కాలేజీలో లెక్చరర్‌గా రెండేళ్ళు పనిచేశాను. పూనాలోని ఎన్‌సీఎల్‌లో సైంటిస్ట్‌గా 66లో చేరాను. 74 వరకూ అక్కడే. వేరే ఎవరికోసమో పనిచేయడం కన్నా, మన కోసం చేసుకోవడం మంచిదనుకుని నేనూ మావారూ ఉద్యోగాలకు రాజీనామా చేసి ఇక్కడికొచ్చి భాగ్యనగర్ లాబొరేటరీస్ ప్రారంభించాం. అప్పటి సరళీకరణ ప్రభావం కూడా కొంత ఉంది.

### ఇంతకీ మీ చిన్న పరిశ్రమ ఇన్నేళ్ళలో పెద్దదయిందా లేదా?

మీకో మాట చెబుతాను. ఒక మల్లెతీగనీ, మామిడిమొక్కనీ నాటామనుకోండి. రెండూ పెద్దవుతాయి. అలాగని పెరిగిపెరిగి మల్లెతీగ మావిడి చెట్టంత పెద్దది అవదుగదా! అలాంటివే చిన్న పరిశ్రమలూ, పెద్ద పరిశ్రమలూ. చిన్న పరిశ్రమలు నిలబడతాయి, బాగా నడుస్తాయి. దేశదేశాలకు శాఖోపశాఖలుగా విస్తరించే సంస్థలతో వాటిని పోల్చుకోకూడదు మనం. మా చిన్నపరిశ్రమ (హైదరాబాద్ బాలానగర్‌లో ఉంది) ఇప్పుడు బాగా నడుస్తోంది. మా అబ్బాయి చూసుకుంటున్నాడు, మావారు రోజూ వెళతారు. నేను అప్పుడప్పుడూ వెళుతుంటా.

### ఇల్లేరమ్మ కథల గురించి చెప్పండి

తెలుగు సాహిత్యంలో చాలామంది అబ్బాయిల బాల్యం ఎలా ఉంటుందో తెలిపేలా కథలు వచ్చాయి. ముళ్లపూడి 'బుడుగు' వంటివి. అదే ఆడపిల్లల బాల్యం ఎలా ఉండేదో తెలిపేలా రచనలేమీ రాలేదు. అది చెబుతూ నామిని నా చిన్నతనం గురించి రాయమన్నారు. అలా ప్రారంభమయ్యాయి 'ఇల్లేరమ్మ కథలు'. మొత్తం 24 వారాలు. మంచి స్పందన వచ్చింది. జీవితాల్లో ఇప్పుడున్నంత టెన్షను మా చిన్నప్పుడు లేదు. ప్రపంచాన్నేదో మార్చేద్దాం అన్న ధోరణి అప్పటి పిల్లలకు లేదు. సమాజం, ఇరుగుపొరుగులు అంతా పిల్లలను సహజంగా పెరిగేలా ఉంచేవారు, అందరూ ప్రేమగా చూసేవారు. అందువల్లనే అప్పటి పిల్లల్లో అమాయకత్వం పాళ్ళెక్కువ. ఇప్పుడు అవకాశాలు పెరిగాయి, అలాగే పోటీ కూడా పెరిగింది.

### చిన్నప్పుడు సాహిత్యం చదివేవారా?

ముందునుంచీ సైన్సు స్టూడెంటును కావడం వల్ల సాహిత్యం లోతుగా చదవలేదు. తెలుగు పర్వాలేదుకానీ, ఇంగ్లీషు అస్సలు చదవలేదు. మాలతీచందూర్ రాసే నవలా పరిచయాలు మాత్రం తప్పకుండా చదివేదాన్ని. ఎందుకంటే మా చెల్లి చిన్నారి బాగా పుస్తకాలు చది

## నచ్చినవి

| | | |
|---|---|---|
| సినిమా | : | మిస్సమ్మ (పాతది) |
| హీరో | : | రవితేజ |
| హీరోయిన్ | : | జెనీలియా |
| సంగీతం | : | ఆహ్లాదంగా అనిపించేదేదైనా |
| గాయని | : | పర్వీన్ సుల్తానా |
| గాయకులు | : | బాలకృష్ణప్రసాద్ |
| ప్రదేశం | : | గుజరాత్‌లోని సోమనాథ్ దేవాలయం |
| ఆహారం | : | పిజా |
| నవల | : | విశ్వనాథ సత్యనారాయణ గారి హిమబిందు |
| కథ | : | కొ.కు. రాసిన అనుభవం |
| కథకులు | : | కొడవటిగంటి కుటుంబరావు |
| రచయిత | : | రావిశాస్త్రి |
| స్నేహితులు | : | మా ఆయనే! |

వేది. ఆమెతో వాటి గురించి మాట్లాడటానికి నాకీ పరిచయాలు పని కొచ్చేవి.

**మీ కథలన్నీ మీ జీవితానుభవాలేనా?**

అవును. కథల్లోని ప్రతి సంఘటనా అక్షరం అక్షరం జరిగింది జరిగినట్టుగా రాయలేదుగానీ, కథలకు ప్రేరణ మాత్రం కొన్ని చూసినవి, మరికొన్ని విన్నవి. కొన్నిటిని ఎగ్జాగరేట్ చేశాను, కొన్నిచోట్ల నిజాలు చెప్పలేదు. ప్రేరణ మాత్రం జీవితంలోనిదే! నాకు పెద్ద శత్రువు బద్ధకం. బద్ధకమే లేకపోతే ఇంకా చాలా రాసేదాన్ని. తప్పని సరయినప్పుడు తప్ప రాయలేదు నేను.

**మీ కుటుంబ సంబంధాలపై మీ కథల ప్రభావం?**


ఇల్లేరమ్మ కథలు వస్తున్నప్పుడు బంధువులు కొందరు మా చెల్లి చిన్నారితో 'చూడు, నిన్నే విలన్లా చిత్రీకరిస్తోంది సుశీల' అని చెప్పేవారు. కానీ వాటివల్ల మా ఇద్దరి అనుబంధంలో ఇబ్బందులేం రాలేదు. ఇక రచనలో మా అత్తగారి ప్రోత్సాహం అంతా ఇంతా కాదు. జీవితంలో నాకే కష్టమూ తెలియకుండా కాచుకున్నారావిడ. దేశంలో అత్తగార్లందరూ ఆవిడలాగా ఉంటే అసలు ఇబ్బందులే రావు.

**మీ ఆధ్యాత్మిక రచనల నేపథ్యం?**

లక్ష్మీబాయ్ కేళ్కర్ అనే మహిళ మరాఠీలో రామాయణాన్ని ప్రవచనాలుగా చెప్పేవారు. ఆ శైలి ఎంతో బాగుంటుంది. అందుకే వాటిని తెలుగులో 'పథదర్శిని శ్రీరామకథ' అని రామాయణాన్ని రాశాను. లోకమాన్య బాల గంగాధరతిలక్ మునిమనవరాలు ప్రొఫెసర్ సింధు నవలేకర్ తర్కం, తత్త్వజ్ఞానాల్లో పండితురాలు. ఆమె ప్రవచనాలను అనువదిస్తూ 'ధర్మ విజయం' అంటూ మహాభారత కథను రాశాను. భారతీయులందరూ భారత, రామాయణాలు ఒక్కసారైనా చదవాలి.

**ఇప్పుడొస్తున్న కథల మీద మీ అభిప్రాయం?**

మంచి సాహిత్యం సమకాలీన సమాజాన్ని ప్రతిబింబిస్తుంది. ఇప్పుడొస్తున్న మంచి కథలు ఆ పనే చేస్తున్నాయి. కె. వరలక్ష్మి, గంటి భానుమతి వంటి వారి కథలు చదువుతుంటాను. చాలాకాలం బద్ధకించిన తర్వాత 'దీపశిఖ' కథల పుస్తకాన్ని తీసుకొచ్చాను. బద్ధకించకుండా మరిన్ని కథలు రాయాలనుకుంటున్నా.



అబ్బూరి ఛాయాదేవి తదితరులతో..

**మీకున్న వ్యసనం ఏమిటి?**

తిరగడం. ప్రతిఏటా దాదాపు యాభైమంది స్నేహితులం, అంతా ఆడవాళ్ళమే కలిసి విహారయాత్రకు వెళుతుంటాం. ఒకోసారి ఒక్కొక్క రాష్ట్రం చొప్పున చూస్తుంటాం. అలా చాలానే చూశాం. అంతా దాదాపు ఒకటే వయసులో ఉంటాం కనుక సమస్యలేవీ రావు.

**ఇల్లేరమ్మ కాస్తా ఊళ్ళేరమ్మ అయిందన్న మాట.**

అవును. అదే నా హాబీ, వ్యసనం. నేను కాలు బైటపెట్టకుండా ఇంట్లో ఉండగలిగే మ్యాక్జిమమ్ సమయం 24 గంటలు. ఇదిగాకుండా సంస్కృతి పరిరక్షణ గురించి మాట్లాడటానికి కూడా చాలా ఊళ్ళు, ప్రదేశాలు తిరుగుతుంటాను.

**షాపింగ్ అలవాటుందా?**

నాకు షాపింగ్ అంటే అసహ్యం. దేనికోసమూ ఎప్పుడూ బజారుకు వెళ్ళను. నా చీరలన్నీ ఇంటిదగ్గరకు వచ్చినవాళ్ళ దగ్గర కొన్నవే! కంచి పట్టు చీరలు మొదలుకొని ఏ రకమైనా మా గుమ్మానికే వస్తాయి.

**- అరుణ పప్పు**

# సమంత రేటు కోటి...?

డిమాండ్‌ను బట్టి ధర ఉంటుందన్న 'ఆర్థిక సూత్రాన్ని' 'ఏమాయ చేసావె' ఫేమ్ సమంత బాగా వంటబట్టించుకుంది. ఆ దిశగా దూసుకుపోతోంది. మొదటి సినిమాతోనే సమంత డిమాండ్ బాగా పెరిగిపోయింది. 'ఏమాయ చేసావె'లో 20 నుంచి 25 లక్షల పారితోషికం తీసుకున్న సమంత రాబోయే చిత్రాలకు తన రేటును ఒక్కసారిగా కోటి రూపాయలకు పెంచేసింది. టాలీవుడ్, కోలీవుడ్‌లో కోటి పారితోషికం తీసుకుంటున్న హీరోయిన్లు ఇబ్బడిముబ్బడిగా ఉన్నా, వారంతా మొదటి సినిమాతోనే తమ రేటును అమాంతం పెంచలేదు. కొన్నిసంవత్సరాలు కష్టపడి, ఆ తరువాత తమ పారితోషికాన్ని పెంచారు. కానీ సమంత మాత్రం ఇప్పుడే తన రేటును కోటి రూపాయలకు పెంచేసిందన్న పుకార్లు టాలీవుడ్‌లో షికారు చేస్తున్నాయి. దీనికి కారణం టాలీవుడ్‌లో స్టార్ హీరోలు అందరూ ఆమెతో చేయడానికి అత్యుత్సాహం చూపించడమే కారణం. దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలన్నది నిజమే అయినా, మొదటి సినిమాతోనే ఈ విధంగా ప్రవర్తించడం మంచిది కాదు అన్నది ఆమె సన్నిహితుల సూచన. ఈ సూచన సమంత చెవిన సోకిందో లేదో తెలియదు కానీ ఇప్పటి వరకూ అంగీకరించిన సినిమాలు కాకుండా కొత్త సినిమాలకు 90 నుంచి 95 లక్షలు డిమాండ్ చేయాలని గట్టిగా నిర్ణయించుకుందట!



నాకు నచ్చిన నా కథ

# యాత్రా స్పెషల్

- డా. సోమరాజు సుశీల

**ఏవేవో పనుల వంకతో పొద్దున్నే బయలుదేరిన జనాలని ఎక్కించుకుని రాష్ట్ర రాజధాని నుండి దేశ రాజధానికి వెడుతున్న ఆంధ్రప్రదేశ్ ఎక్స్‌ప్రెస్ మధ్యలో కాసేపు కాజీపేటలో ఆగింది. కొత్తగా పదవీ విరమణ చేసినందువలన కలిగిన విశ్రాంతితోనూ, ఆ తాలూకు డబ్బులొళ్లో పడ్డందువల్ల వచ్చిన ఆనందంతోనూ, జవసత్వాలింక రిటైరవలేదులే అన్న ధీమాతోనూ కళకళలాడిపోతున్న ఒక సరికొత్త సీనియర్ జంట రైలెక్కారు. మనం తరచూ చూస్తూనే వుంటాం. కొత్తగా రిటైరయ్యారని ఎవరూ చెప్పక్కర్లేనట్లుగా వుంటారు నూతన వధూవరులల్లేనే! వాళ్లని రైలెక్కించడానికని వచ్చిన కుర్రాడు కిటికీ ఊచలు పట్టుకుని వేళ్లాడు తుండగానే ఆయన ఒక్కడే చకచకా సామాన్లన్నీ సర్దేసి కాస్త గర్వంగా ''ఏమిటనుకున్నావ్?'' అన్నట్లు భార్యకేసి చూశాడు.**

ఆవిడేం ఆయన్ని పట్టించుకోకుండా, ''వెళ్లొస్తారా శ్యామూ! ఇల్లు జాగ్రత్త! అమ్మతో చెప్పు.... జానీ కోసం చిన్న ప్యాకెట్టు చాలు. పది రోజుల్లో వచ్చేస్తాం. ఎక్కడ్నించైనా ఫోన్లు చేస్తూ వుంటాంలే'' ఆవిడ అప్పగింతలు పూర్తవకుండానే రైలు బయలుదేరింది.

ఎనిమిది మంది తెల్లవార్లూ చచ్చినట్లు పడుకుని ప్రయాణించడానికి వీలుగా డిజైను చేసిన ఆ స్లీపరు పెట్టె భాగంలో మిగతా ఆరుగురూ సికింద్రాబాదులోనే ఎక్కి అప్పటికే సెటిలయిపోయారు. అదృష్టం కొద్దీ అక్కడ ఒక ముద్దులు మూట గట్టే ఒక రెండేళ్ళ పిల్లాడూ, వాడి అమ్మానాన్నలు తప్పించి మిగతా వారంతా నడి వయసులో వున్నామనుకుంటున్న వాళ్లే. వాడొక్కడే స్టార్ ఎట్రాక్షను. పిల్లలతో ప్రయాణం, అదీ పరాయి పిల్లలతో ప్రయాణం అంటే ఎవరికన్నా భయమే! మూడేళ్ల లోపు వాళ్లు ఇద్దరు ముగ్గురున్నారంటే చచ్చారన్నమాటే ప్రయాణికులు. వాళ్లకి అమ్మపక్క తప్ప వేరే బెర్తులుండవు కదా! వాళ్లు అల్లరాపరు. తల్లులు పట్టించుకోరు. మరీ ఎక్కువయితే నోట్లో ఏదో కూరుతూ వుంటారు. అవి తిని వాళ్లు ఇంకా విజృంభిస్తుంటారు. మన వాళ్లకి అంటే శ్రీమతి మరియు శ్రీకృష్ణమూర్తి గారివి సైడు బెర్తులు. అరవైకి ఆర్నెల్లు తక్కువయిన వాళ్లని సైడ్ అప్పర్ బెర్త్ ఎక్కించడం రైల్వే వాళ్లకి భలే సరదా. అసలు రైలు టిక్కెట్లిచ్చేటప్పుడు మనిషి వయసుతో బాటు బరువు కూడా రాయాలని చెప్పి ఆ ప్రకారం బెర్తు ఎలాట్‌చేస్తే ప్రయాణీకులకి జరిగే అన్యాయంలో కొంత వరకయినా తగ్గించవచ్చని వాళ్లకెందుకు తోచదో!

ఇద్దరూ పెళ్లిళ్లలో దండాడింపుకి కూచున్నట్లుగా ఎదురుబదురుగా మఠం వేసుక్కూచున్నారు. ఆయన చేతిలో గీతాసారాంశమూ, ఆవిడ చేతిలో ఎవరిదో బోధనామృతమూ, పెద్దపెద్ద బైండు పుస్తకాలు ఎంత ప్రయాణానికయినా సరిపడేంత వున్నాయి. దీక్షగా చదవాలని విశ్వప్రయత్నం చేస్తున్నారు. ఎంత సాధన చేసినా అదేవిటో పేజీ తిప్పడమే అవట్లేదు. ఇదేవన్నా అమ్మాయిలు మిల్స్ అండ్ బూన్స్ చదివినట్లా! ఆ సాధనలో భాగంగా మధ్యమధ్యలో చదివింది వంటబట్టించుకోవడానికన్నట్లు కిటికీలోంచి బయటకు చూస్తున్నారు. ముందు ఆయనే ఓడిపోయాడు. ఆ పుస్తకం అక్కడ పడేసి ఆవిడని కదిపే ప్రయత్నం చేశాడు.

''ఈ వారం మన సత్యం దగ్గర్నించి ఫోన్ వచ్చిందా?''

ఆవిడ ఒకసారి కళ్లెత్తి చూసి మళ్లీ పుస్తకంలోకి తల దూర్చింది.

''నిన్నే! పిలిస్తే వినిపించుకోవేం? ఏభై ఏళ్లకే చెవుడొచ్చిందా?''

''నాకు ఏభై. మీకు ఏభై రెండు! వ్యాపారాభివృద్ధి కోసం ఏ దిక్కుమాలిన కంపెనీ వాడన్నా ఏభై అయిదేళ్లలోపు వాళ్లకి పోటీలు పెట్టి అండమాన్ యాత్ర చేయిస్తానని బహుమతి ప్రకటించిందా?''


''అంతకోపం ఎందుకోయ్! పోనీ ఏభై అయిదేళ్లకి చెవుడొస్తుందేమో తెలుసు కోవచ్చా!''

''మీ దయ వల్ల ఇప్పటివరకూ గుడ్డీ చెవుడూ ఏవీ రాలేదు. కానీ అక్కర్లేని విషయాలెత్తి నిక్షేపం లాంటి నామతి పోగొట్టే ప్రయత్నాలు చేయకండి''.

''అంటే కన్నకొడుకు విషయం నీకక్కర్లేనిదయిందన్నమాట. కోపానికన్నా ఒక హద్దుండాలి! పెద్దవాళ్లం మనం సర్దుకోకపోతే ఇంక మన పెద్దరికాలెందుకు?'' ఆవిడేం సమాధానం చెప్పకుండా కిటికీలోంచి బయటకు చూస్తూ కూర్చుంది.

''ఇప్పుడూ! మరీ! ఇదుగో! ఏవన్నా అంటే నీకు కోపం వస్తుంది గానీ ఇందులో ఆ పిల్ల తప్పేముంది? అమెరికను పిల్లయినా మనల్ని మమ్మీ డాడీ అని పిలుస్తూ ఎంత ఆపేక్ష పడింది. మన కోసం వాడిచేత కారు కొనిపించిందా, లేదా? మరి నీ కొడుకేం తక్కువ వాడా! అక్కడ నాలుగేళ్లనించీ దానితో కాపురం చేస్తూ ఇక్కడ మన చేత ఎన్ని సంబంధాలు పెండింగులో పెట్టించాడు! ఎన్ని జాతకాలు మాచ్ చేయించాడు?''

''చివరిగా చెప్తున్నా! టి.సి. వస్తున్నాడు! ఇక్కడ కూచోనా, లేకపోతే



ఆయన్ని బతిమాలి ఇంకో చోటికి మారిపోనా?''

''వద్దులే! వద్దులే! మనం తిరిగి ఇల్లు చేరేవరకూ నీ కందిగింజ కొడుకూసు ఎత్తనులే! సరేనా! నువ్వీ సీటు ఖాళీ చేస్తే టి.సి. గారు ఏ పిల్లకో ఎలాట్ చేస్తే అసలే తట్టుకో లేవు!''

''తాతా పెళ్లాడతావా అంటే పిల్లనెవరిస్తార్రా అన్నాట్ట వెనకటికి మీలాటివాడే. నేనీ సీటు ఖాళీచేస్తే ఎవత్తెనో తెచ్చి ఎలాగోలా సర్దుబాటు చేసుకుందామనె! ఆశకేం తక్కువలేదు. ఛ! మగబుద్ధి మారదు'' సంభాషణ తు.చ. తప్పకుండా ఒక చెవ్వేటు పారేసి వింటున్న పిల్లవాడి తల్లి మొగుడుకేసి చూస్తూ పిల్లాడి బుగ్గ గిల్లడంతో ఆ చంటాడు బావురుమన్నాడు. నవ్వుకుంటూ వాడికి ముద్దులు పెట్టి వూరుకో బెట్టింది. స్టార్ డస్టులో లారాదత్తాని స్టడీ చేస్తూ తపోదీక్షలో వున్న ఆ పిల్ల మొగుడ్ని కొడుకు ఏడుపు ఏ మాత్రం కదిలించలేకపోయింది.

ఎవరయినా తీర్థయాత్రలనే సరికి ఎప్పుడే అవసరం పడుతుందోనని ముందు జాగ్రత్తగా పచ్చళ్లు, పొడులు, మందులు, కత్తెరా, ఫస్ట్‌ఎయిడ్, సూదీదారం, జిగురు, ఛెస్సు, పేకలూ... నిత్యజీవితంలో ఎప్పుడో గానీ వాడనివెన్నో తెచ్చు కుంటారు గదా! అలాంటివాటిల్లో చాలాతేలికగా అందు బాటుగా వుండేటట్లుగా సర్దుకున్న పేకలు పైకి తీసి ఆడుకోవడం మొదలు పెట్టారు. కానీ ఎన్ని రౌండ్లు పేకలాడితే, ఎందరి చరిత్రలు నెమరువేస్తే ఢిల్లీ చేరాలి! పొద్దున్నుంచీ కాఫీలు సప్లయి చేసిన వాడు ఆ క్యాను శుభ్రంగా కడి గేసి దాన్నిండా వేడివేడి టమాటా సూప్ పోసుకొచ్చి వూరించడం మొదలు పెట్టాడు. వాడొక్కడిని ఆకర్షించగలిగితే సక్సెస్ అయినట్లే! మిగతా ఏడు గురూ చచ్చినట్లు ఫాలో అయిపోతారు. ఎనిమిది మంది సూప్ తాగేశారు. అలా చేయకపోతే పల్లెటూరి వాళ్లనుకునే ప్రమాదం వుంది కదా! పది మందిలో వున్నప్పుడు నాగరికులం అనిపించుకోవాలంటే ఇలాంటివి తాగుతూ వుండాలి. గారెలు, ఆవడలు, ఎంత బాగున్నా తిన కూడదు. మంచూరియాలు, పిజ్జాలు, నూడుల్స్, స్ప్రింగ్‌రోల్సు తింటూ వుండాలి. ఈ లోపల ఆవిడ తనక్కోపం వచ్చి మాట్లాడొద్దనుకున్న సంగతి మర్చిపోయి ఆయన్ని పలకరించింది.

''ఏవండీ! జానీ మనకోసం బెంగెట్టుకుంటుందేమో! మనం లేకుండా వుంటుందంటారా?''

''అప్పుడే మొదలుపెట్టావు! పిల్లల సంగతి ఎత్తితే నచ్చదుగానీ, కుక్క పని కొస్తుందన్నమాట. ఎందుకుండదూ! మనవాడు కోర్టు నుంచి వచ్చినప్ప ట్నుంచీ ఇది వాడ్నొదుల్తుందా? నువ్వింట్లో వుంటే ఏమీ పట్టించుకోదు గానీ, లేవంటే సరళ బాధ్యతగానే చూసుకుంటుందిలే!''

ఇంకేం మాట్లాడకుండా దగ్గిరకి వచ్చి నుంచున్న పిల్లవాడ్ని పేకలతో ఆడించడం మొదలుపెట్టింది. అమ్మమ్మ అమ్మమ్మ అంటూ నెమ్మదిగా వాడు ఆవిడ వళ్లో చేరి గొలుసులు లెక్కపెట్టడం మొదలుపెట్టాడు. అందరికీ సూపు లందాయని నిర్ధారించుకున్న తర్వాత భోజనాలొచ్చేశాయి. ఆ హడావిడి అయ్యాక అందరూ మళ్లీ దుప్పట్లు పరచుకుని నిద్రపోక పోతే టిక్కెట్టు గిట్టు బాటవదేమోనన్నట్లుగా రైలు హోరుతో దీటుగా గుర్రు పెట్టారు. కొంత మంది తప్పనిసరి అయి పడుకుని కళ్లు మూసుకున్నా రైలు తల్లి ఊపిన ఉయ్యాలకి గాఢ నిద్రలోకి జారుకున్నారు. ''ఎంతసేపు ఆ వెధవ నిద్దర్లూ! లేచి కూచుని ఈ వేడివేడి వడలు తినండి'' అని ఇంకోడొచ్చి కేకలేసేటప్పటికి భయపడి అందరూ లేచి కూచున్నారు. రైలు ప్రయాణాల్లో అప్రకటిత నియమం ఏమిటంటే– ఆకలివేసినా, వేయక పోయినా, అలవాటున్నా, లేక పోయినా ఏదమ్మొస్తే అది కొనుక్కు తినాలి. నిద్దరొచ్చినా రాకపోయినా పడుండాలి. ఒక భోజనమూ, నిద్దరా అయేసరికి ఆ పెట్టెలో వున్న ఏడెని మిది మందికీ మనమంతా ఒకటేనన్న బంధుప్రేమ లాంటిది కలిగినట్లుంది. కనీసం ఇంకో రెండుగంటల వరకూ ఎంత మంచి దమ్మొచ్చినా తినడం వీలు పడదని గ్రహించారు కాబట్టి నెమ్మదిగా పరిచయ కార్యక్రమాలు మొదలుపె ట్టుకున్నారు. ఏదో ఒకటి మాట్లాడకపోతే పొద్దు గడవదు మరి. ఢిల్లీ వెళ్లే రైల్లో ప్రయాణం చేస్తున్నా ఎవరన్నా అడిగే మొదటి ప్రశ్న ''ఢిల్లీ వెడుతు న్నారా?'' అని ''పని మీదా?'' అని రెండో ప్రశ్నే కదా! ఎవడికయినా కాస్త తిక్కపుడితే ''పనేం లేక బొంబాయి వెడుతున్నా'' అని చెప్పి అవతల వాడికి మారుమాట లేకుండా చేయవచ్చును. కానీ పాపం మన కృష్ణమూర్తిగారు అలాటి మనిషికాదు. ఇంటి ఇల్లాలితో ఏం మాట్లాడదామన్నా పొసగని వ్వడం లేదు. ఎవరు పలకరిస్తారా అని ఎదురు చూస్తున్నాడేమో, ఇంచు మించు తన వయస్సులోనే వున్న నలభై మూడో బెర్తాయన ''ఢిల్లీ వరకేనా'' అని అడిగిన ప్రశ్నకి సానుకూలంగా స్పందించాడు.

''అవునండీ! కానీ మా అసలు ప్రయాణం మొదలయ్యేది అక్కడ్నించే. ఎనిమిది రోజుల ఉత్తర భారత యాత్రకి టిక్కెట్లు కొనుక్కున్నాం. హోటల్ వాళ్లు స్టేషనుకే కారు పంపుతారట. ఇంక మన బాధ్యత అంతా వాళ్లదే. తిరిగి

మళ్లీ వాళ్లే స్టేషనులో దింపుతారు. రైలెక్కడం, ఇల్లు చేరడం!''

''సర్వీసులో వుండగా అయితే ఫరవాలేదు గానీ తరువాత ఇలాంటి ప్రయాణాలు కష్టమేమో! నలభై దాటదూ?''

''ముప్పై సరిపోతుందేమో! సర్వీసులో వుండగా ఎలా కుదుర్తాయింతింత ప్రయాణాలు! పిల్లలు, చదువులు, ఉద్యోగాలు, పెళ్లిళ్లు, అమెరికా పంపడాలు... పేరుకి నలుగురు కొడుకులయినా కూతుళ్లని కన్నవాళ్ల కన్నా ఎక్కువ శ్రమ పడ వలసివచ్చింది. ఇప్పటికందరూ సెటిలయ్యారు. పెద్దవాడొక్కడే మాతో ఇండియాలో వున్నాడు. మిగతా ముగ్గురూ అమెరికాలోనే. కాబట్టి డబ్బిబ్బందంటే ఏవిటో తెలియకుండా గడిపేస్తున్నాం! ఇలా ప్రయాణం అను కుని ఒకడికి ఫోనులో చెప్తే ముగ్గురూ డాలర్లు పంపేశారు. వాళ్లు పంపుతారని మేం అనుకోలేదు''.

వింటున్నాయనకి నమ్మబుద్ధి కాకపోయినా ఆనందం ప్రకటించక తప్పలేదు. ''మీరదృష్టవంతులండి. పెట్టి పుట్టారు. పిల్లలమెరికాలో వుండడమే గొప్ప కాదు గానీ వాళ్లింత ప్రేమగా మీ అజ కనుక్కోవడం మీరు చేసుకున్న పుణ్యమే!''

ఇప్పటికి సరి అయిన శ్రోత దొరకడంతో కృష్ణమూర్తి గారి ఉత్సాహం పట్ట రాకుండా అయిపోయింది. ''కేవలం పుణ్యం అంటే నేనొప్పుకోను. చాలామటుకు పెంపకంలో వుంటుంది. మా పిల్లల విషయంలో క్రెడిటంతా వాళ్లమ్మదే. నేనొక్కరోజు కూడా ఇంటి సంగతులు పట్టించుకోలేదు. ఏదో, వచ్చిన జీతం తీసుకొచ్చి ఆవిడ చేతిలో పొయ్యడం వరకే! మరి అంతంత చదువులు ఎలా చెప్పించిందో ఆవిడకే తెలియాలి. మా మూడో వాడికి మెరిట్ సీటు రాలేదని ఎంసెట్ మళ్లీ రాయించింది. అంత స్ట్రిక్టుగా వుండేది వాళ్లతో. అయినా అదేవిటో పిల్లలకి వాళ్లమ్మంటేనే ఎక్కువ! ఈగ వాలనివ్వరు!''

''కాసేపు నన్నుపొగడ్డం ఆపుతారా? చిరాకొచ్చేస్తోంది! ఏదన్నా సినిమాల గురించో, చంద్రబాబునాయుడు గురించో మాట్లాడుకోకూడదు!''

''నీకూ, నీ పిల్లలకీ ఎవరూ దిష్టి కొట్టర్లేవోయ్! మరి ఈ వయసులో మనం వాళ్ల గురించి మాట్లాడుకోకపోతే ఏం చేస్తాం చెప్పు! పోనీ ఓ పని చేద్దాం. మీ తమ్ముడెప్పుడొస్తాడో...''

''వాడి సంగతి అసలు వద్దు. తోచకపోతే అవిగో టేకుచెట్లకున్న పూలు లెక్క పెట్టండి'' సంభాషణ కుటుంబ విషయాలు నుంచి వేరే విషయాలకు మళ్లించాలని పక్కాయన ప్రయత్నం చేస్తాడు. ఆయన ఎందులో పనిచేసి రిటైరయ్యారో తెలుసుకునేందుకు ఆరా తీసి... కానీ ఇంటి ఇల్లాలు సలక్షణంగా కూడా వున్నప్పుడు అన్య విషయాలు ఎలా ప్రవేశించగలవు?

''ఆయనెందుకు అడుగుతారు గానీ నేచెప్తా వినండి! ఈయనగారు మన ప్రభుత్వం పర్యవేక్షణలో వున్న లైబ్రరీలన్నిటిలోనూ కలిసి ముప్పై ఏళ్లు పనిచేసి ఇదుగో రెండేళ్ళ క్రితం రిటైరయినారు. అక్కడ ఎక్కువ మాట్లాడేందుకు వీలుండదమో కదా! అందుకని ఇపుడిలా వాగి వాగి నన్ను చంపుకు తింటున్నారు''.

''మీరు కోపగించుకోకండమ్మా! రిటైరవడంలో వున్న కష్టం మీ ఆడవాళ్లకెలా తెలుస్తుంది? ఏ పనీ లేకపోతే పూలు కడుతూనో, గోంగూర వలుస్తూనో అయినా కాలక్షేపం చేసుకోగలరు. మరి మాకలా జరగదు కదా!''

''జాగ్రత్తండి బాబూ! మీరు కూడా వలవచ్చు కదా అంటుంది. ఇందాకట్నించి చూస్తున్నారుగా తనతో సంభాషణ ఎంత కష్టమో! చివరికి మా కోడలితో కూడా ఇంతే! మనసులో ఎంత ఆపేక్షుంటే ఏం లాభం. నోరెత్తి మాట్లాడకపోతే ఆ పిల్లకి ఏం అర్థమవుతుంది?''

''మీ ధోరణి కాస్త ఆపుతారా?''

''చూశారా! మళ్లీ... మా కోడలు బాగా కలిగినవాళ్ల ఇంట్లోంచి వచ్చింది. అస్తమానం అమెరికా మరదుల సంపాదనతో తన మొగుడిని పోల్చి వాడ్ని తక్కువ చేస్తుందని ఆవిడకి కోపం. పోనీ మీరు పొండిరా ఆ దేశం అంటే మావాడొప్పుకోడు. మీరు పెద్దవాళ్లయిపోతున్నారు. మేమన్నా కూడా లేకపోతే ఎలా అంటాడు''

''మీ అబ్బాయి గారన్నదీ నిజమే కదా! ఏమయినా మీరు అదృష్టవం



## కథాంతరంగం



ఇప్పుడున్న జీవనశైలిలో తల్లిదండ్రులకూ పిల్లలకూ మధ్య చాలా దూరాలున్నాయి. పిల్లలున్నారా అంటే పేరుకు ఉంటారు, కానీ మన జీవితంలో కాకుండా ఎక్కడో దూరంగా ఉంటారు. మంచీ చెడూ పంచుకోవడానికి, కష్టం సుఖం చెప్పుకోవడానికి ఒకరికొకరు అందుబాటులో ఉండరు. అలాంటి ఉండటానికీ, లేకపోవడానికీ పెద్ద తేడా లేదు. అయినా ఎక్కువమంది తల్లిదండ్రులు తమ పిల్లలను విదేశాలకు పంపడానికే ఇష్టపడతారు. అక్కడ ఉద్యోగాలుండీ లేకా, రకరకాల పరిస్థితుల్లో వాళ్లెంతో కష్టపడుతుంటారు. అదంతా ఇక్కడ వీళ్లకి తెలీదు. పిల్లలు కూడా తమ మంచినే చెబుతారుగానీ, చెడో కష్టమో పెద్దవాళ్ళకు చెప్పరు. అదీ ఇప్పుడున్న మొత్తం వ్యవస్థ. దాన్ని దృష్టిలో పెట్టుకునే ఈ కథ రాశాను. అందులోని పెద్దమనిషికి స్ఫూర్తి మా నాన్నే! వైట్ లైస్ అంటారు చూడండి, అలాంటివి మా నాన్న బోల్డు చెప్పేవారు. అంటే వాటివల్ల ఎదుటివారికేమీ హాని ఉండదు, నిజం తెలిసినా ఇవతలివారికి పోయేదేం ఉండదు. అవి విని ఊరికే సరదాగా నవ్వుకోవచ్చు. అలాగని ఫాల్స్ ప్రిస్టేజీ కోసం చెప్పేవి కాదు. ఆ స్ఫూర్తితో ఈ కథలో ప్రయాణికుణ్ని మలిచాను.

– డా. సోమరాజు సుశీల

93910 15063

తులే!'' అని నిట్టూర్చాడు. వీళ్ల కబుర్లిలా ఓ దారీతెన్నూలేకుండా దశదిశలా దేశ దేశాలా ప్రసరిస్తుండగానే సూర్యుడు డ్యూటీ దిగి స్పీడుగా చక్కా పోయాడు. రైల్లో జనాలందరికీ ఏదో ఒకటిచేసి చేసి మాట్లాడి మాట్లాడి నీరసాలూ, విసుగులూ వచ్చేశాయి. ఇంక సంభాషణలన్నీ 'ఆ'తోనో 'ఊ'తోనే ఆగిపోవడం మొదలు పెట్టాయి. ఇంతలోనే తళతళలాడుతూ రాత్రి భోజనాలొచ్చేశాయ్. ''అంతా ప్యాకింగ్ షోకే అమెరికా బతుకుల్లాగా! ఏవీ నోట్లో పెట్టుకోలేం. అయినా పూరీలింత గట్టిగా చెయ్యొచ్చని ఎవడు నేర్పించాడో రైలు వంటవాళ్లకి'' అని సణుక్కుంటూ భోజనాలు కానిచ్చారు. భోజనాలయ్యేటప్పటికి ఇంకో రెండు మాటలు చివరాఖరుగా మాట్లాడదామనిపించింది.

''కృష్ణమూర్తిగారూ! ఇందాకట్నించీ అడుగుదామనుకుంటున్నాను. ఏవిటో! మావాడెళ్లి రెండేళ్లు పూర్తయింది. ఇంకా చదువే అవలేదుట. ఇక్కడ ఇంజనీరింగు డొనేషను కట్టి కర్ణాటకలో చదివించాను. మళ్లీ అక్కడికి పంపేందుకు అయిదు లక్షలు అప్పుచేశాను. వడ్డీలు కట్టలేక తలప్రాణం తోక్కొచ్చింది. మా వాడక్కడ నించి ఏవన్నా పంపగలడంటారా?''

''దిగులు పడకండి. ఎంతలేదన్నా సెటిలవాలంటే మరి అయిదారేళ్లు పడు తుంది. ఈ సెప్టెంబరు 11 తర్వాత కుర్రాళ్ల పని మరీ కష్టమయిపోయింది. మనం అంతా కొంతన్నా సంపాయించుకుని స్థిరపడ్డాక ఇల్లు కట్టుకోవాలని ఆలోచించే వాళ్లం. అనకూడదు గానీ ఆ దేశంలో సంపాయించబోయే డబ్బుల్తో ఇళ్లూ వాకిళ్లూ చేసుకోబోయే పిల్లతో సంసారాలూనూ.... ఇంటికి డబ్బులు పంపాలంటే నిజంగానే డబ్బులు కనపడవు. మీరే కాస్త మొహమాటపడకుండా ఇబ్బందులన్నీ ఏకరువు పెడుతూ వాళ్ల బాధ్యతలు జ్ఞాపకం చేస్తూ వుండాలి. ఊరుకుంటే ఇంక అంతే సంగతులు చాలామంది విషయంలో! ఆ నీరూ గాలీ నేలా అలాంటివి! మనిషిని. మసలనియ్యవు!''

ఈసారి ఆలోచనలో పడడం ఆయన వంతైంది. భోజనాల వాడొచ్చి వాడసిస్టెంటు సాయంతో పొద్దుట్నించీ అప్పటిదాకా తిన్న తాలూకు డబ్బులన్నీ కక్కించి తృప్తిగా వెళ్లిపోయాక అందరూ నిద్రకుపక్రమించారు. రైలు నిజాముద్దీన్ స్టేషన్ చేరబోతుండగా దుప్పట్ల వాడొచ్చి లాగేసుకోవడంతో అందరూ లేచి కూర్చున్నారు. నిశ్శబ్దంగా షేక్‌హ్యాండిచ్చి సెలవు తీసుకున్నారు. బండి దిగామంటే ఇంక వాళ్లెవరో, మనమెవరో, జాగ్రత్తగా చూస్తే జీవిత సత్యాలన్నీ రైలు ప్రయాణాల్లోనే కనిపిస్తాయి.

వాళ్లనుకున్నట్లుగానే స్టేషనుకి హోటలు కారొచ్చింది. ఇంక మన వాళ్లిద్దరే! ఏకాంతం దొరకగానే విరుచుకుపడింది.

''మన ప్రయాణం పదిరోజులూ ఇలాగే కాల్చుకుతింటారా నన్ను! తీర్థయాత్రలని చెప్పి బయల్దేరదీసి ఇన్ని పచ్చి అబద్ధాలా! మనకి నలుగురు కొడుకులా? అందులో ముగ్గురు అమెరికాలోనా! ఏం పాపం కూతుళ్లొద్దూ! కమ్మగా వండి పెట్టేవాళ్లు! నాన్నా నాన్నా అని మిమ్మల్నే వెనకేసుకొచ్చే వాళ్లు!''

''ఏం తేడా పడుతుంది చెప్పు! అందరూ పిల్లల్ని కని నానా పాట్లు పడి పెంచి వాళ్లంతా తలాచోట ఎలాగెలాగో బతుకుతుంటే వాళ్లని తల్చుకుని బెంగ పడుతుంటారు. మనం అసలు పుట్టని పిల్లల్ని వూహించుకుని హాయిగా ఆనంద పడుతున్నాం! ఏ ఆటాడినా మనసే కదా! ఏదో నా సరదా నాది! ఇంక కూతుళ్ల సంగతి తిరుగు ప్రయాణంలో! ఎంత మందుంటే బావుంటుందో చెప్పు!''.

*



ఈడు... జోడు ... అందం... ఐశ్వర్యం
కళ్యాణం ... కాకతీయ!

కాకతీయ మ్యారేజస్ ప్రై. లిమిటెడ్.
103, 109 & 203, విజయశ్రీ అపార్ట్‌మెంట్స్, చర్మాస్ వెనుక,
అమీర్‌పేట్, హైదరాబాద్. 500 073.
ఫోన్స్: 040 - 23747777, 9391999999

FREE online Registration &
Free search



www.kaakateeya.com
www.telugumarriages.com
www.kannadamarriages.com
www.tamilmarriages.com



అమీర్‌పేట్ | నెల్లూరు
కూకట్‌పల్లి | తిరుపతి
దిల్‌షుఖ్‌నగర్ | కర్నూలు
విజయవాడ | (చెన్నయ్) టి.నగర్
గుంటూరు | బెంగుళూర్
తెనాలి | సేలం
విశాఖపట్నం | మధురై
రాజమండ్రి | వెల్లూరు
కాకినాడ | తిరుచి
ఖమ్మం | పాండిచ్చేరి
ఒంగోలు | ఈరోడ్
ఏలూరు

చెన్నయ్ (అన్నానగర్), చెన్నయ్ (పోరూర్), (చెన్నయ్) తాంబరం, జయానగర్, కోయంబత్తూరు.




## తమన్నాకు గుడి?

ఏ హీరోయిన్ అయినా తమకు తెగ నచ్చితే, వారికి గుడి కట్టి పూజించడం తమిళ తంబిల ఆచారం. గతంలో కుష్బూ, నయనతారతో పాటు మరికొందరు హీరోయిన్లకు గుళ్ళు కట్టడం, కోపం వస్తే కూల్చడం తెలిసిన విషయమే! ఈ సారి తమన్నా వంతు వచ్చింది. తమిళంలో దూసుకుపోతున్న తమన్నాకు గుడి కట్టాలని తమిళ తంబిలు తెగముచ్చటపడుతున్నారు. ఈ మేరకు సన్నాహాలు కూడా చేసుకుంటున్నారట! అయితే ''ఈ విషయం ఇంత వరకూ నాకు తెలియదు. నా మీద అభిమానం ఉంటే నా సినిమా ఒకటికి రెండుసార్లు చూడాలే తప్ప ఇలా గుళ్ళు కట్టి నన్నో దేవతను చేయకండి ప్లీజ్...'' అంటూ తమన్నా తన అభిమానులను వేడుకుంటోందట! తమ గోల తమదే తప్ప ఎదుటి వారి గోల పట్టించుకునే ఆచారం తమిళ తంబిలకు లేదు కాబట్టి, తమన్నా వేడుకోళ్ళు వేస్ట్ అయినట్టే!